క్లుప్తంగా

స్కూల్ కాంప్లెక్స్ కేంద్రాల్లో ప్రశ్నపత్రాలు

● ఏపీటీఎఫ్ వినతి



వినతిపత్రం అందుకుంటున్న డీఈఓ మాణిక్యంనాయుడు

విజయనగరం అర్బన్: జిల్లాలో ప్రారంభమైన ఎస్ఏ-1 పరీక్ష పత్రాలను మండల కేంద్రాల నుంచి స్కూళ్లకు తేవడం ఇబ్బందికరంగా ఉందని.. సమీప స్కూల్ కాంప్లెక్స్ కేంద్రాలలో ఉంచాలని ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు కమిటీ ప్రతినిధులు డీఈఓ యూ.మాణిక్యంనాయుడును బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, దూర ప్రాంతాల్లో ఉన్న మండల కేంద్రం నుంచి పరీక్షపత్రాలను రెండు పూటలా తీసుకురావడం ఇబ్బందిగా ఉందని చెప్పారు. అలాగే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను సర్దుబాటు చేయాలని, పదో తరగతి వంద రోజుల ప్రణాళికలో సెలవు దినాలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్వీ పైడిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏబీ శ్రీనివాసరావు, సీహెచ్‌వీఎస్ఎన్ మూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు బి.వెంకటరమణ, జిల్లా కౌన్సిలర్ పి.బాబూలాల్, జిల్లా అకడమిక్ కన్వీనర్ సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి



విద్యార్థులకు గీతా సారాంశాన్ని వివరిస్తున్న వక్తలు

నెల్లిమర్ల: పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో గీతా జయంతి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సమరసతా సేవా ఫౌండేషన్ ప్రతినిధి లక్ష్మి, సరస్వతీ శిశు మందిర్ సమితి అధ్యక్ష, కార్యదర్శులు పి. సీతారాములు, కందర్ప మురళీకృష్ణ విద్యార్థులకు భగవద్గీత గొప్పతనం వివరించారు. శ్రీకృష్ణ పరమాత్ముడు బోధించిన గీతలో ప్రతి సమస్యకూ పరిష్కారం లభిస్తుందన్నారు. పాఠశాల ప్రధానాచార్యులు ఎం. శ్రీనివాస రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్ మణికంఠ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై కొనసాగుతున్న దాడులు



దుకాణాలను తనిఖీ చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

విజయనగరం: నగరంలో నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై ప్రజారోగ్య సిబ్బంది దాడులు కొనసాగుతున్నాయి. ప్రజారోగ్య సిబ్బంది సర్కిళ్ల వారీగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్లాస్టిక్ విక్రయాలపై తనిఖీలు చేపడుతున్నారు. పారిశుధ్య పర్యవేక్షకుల నేతృత్వంలో బృందాలుగా ఏర్పడి నగర వ్యాప్తంగా పర్యటిస్తూ దుకాణాలు, పళ్ల వ్యాపారులు, టిఫిన్ దుకాణాలను తనిఖీ చేస్తూ పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని, వ్యాపారులపై కేసులు నమోదు చేస్తున్నారు.

సాగునీటి సంఘ ఎన్నికలకు నోటిఫికేషన్



ఎన్నికల నోటిఫికేషన్ అతికిస్తున్న ఎన్నికల అధికారి జగన్నాథరావు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో సాగునీటి ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్‌ను అధికారులు బుధవారం ప్రచురించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి వీవీఆర్ జగన్నాథరావు మాట్లాడుతూ.. మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ఈ నెల 14న ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఆయకట్టు రైతులు ఈ ఎన్నికల్లో ప్రత్యక్షంగా పాల్గొనాలని కోరారు. ఎన్నిక అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్షుల పేర్లను ప్రకటిస్తామని చెప్పారు. సభ్యులందరు ఈ ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అధ్వానంగా గాంధీ పార్కు..



విరిగిన జారుడు బల్ల



పరిసర ప్రాంతాల్లో క్షీణించిన పారిశుధ్యం



కనీసం పెయింటింగ్‌లకు కూడా నోచుకోని ముఖద్వారం

జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కుకు ఎంతో విశిష్టత ఉంది.. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఉదయం , సాయంత్రం వేళల్లో పార్కులో వాకింగ్ చేయడంతో పాటు సేద దీరేవారు.. చిన్నారులు ఆటలాడుకోవడానికి ఎన్నో పరికరాలు ఏర్పాటు చేశారు.. ఆహ్లాదకర వాతావరణంలో పెద్దలు కాలక్షేపం చేసేవారు.. అటువంటి గాంధీ పార్కు నేడు అధ్వాన స్థితికి చేరుకుంది.. సరైన సౌకర్యాలు లేకపోవడంతో పాటు చిన్నారులు ఆటలాడుకునే వస్తువులన్నీ విరిగిపోయాయి.. పరిసరాలు చిందర వందరగా మారిపోవడంతో గాంధీ పార్కు నిర్వహణపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం





నిర్వహణకు నోచుకోని స్కేటింగ్ కోర్టు



విరిగిన కుర్చీ



విరిగిన చిన్నారుల ఆట పరికరాలు

సమస్యలను పరిష్కరిస్తాం..

● తహసీల్దార్ తాడ్డి గోవింద



పూసపాటిరేగ: రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ గోవింద, తదితరులు

పూసపాటిరేగ: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తామని తహసీల్దార్ తాడ్డి గోవింద అన్నారు. మండలంలోని రెల్లివలసలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మ్యూటేషన్లు, డీ పట్టా మంజూరు, వివిధ భూ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులు చేశారు. దీనికి తహసీల్దార్ గోవింద స్పందిస్తూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదన్నారు. జిరాయితీ భూములు ఆక్రమణకు గురైనట్లయితే బాధితులకు అండగా నిలిచి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్వేయర్ గణపతిరావు, సర్వే డీటీ కల్యాణి, ప్రజాప్రతినిధులు ఇజ్జరోతు ఈశ్వరరావు, పతివాడ తమ్మునాయుడు, గొర్లె రమణ, రైతులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

నెల్లిమర్ల: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ సూచించారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని బైరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మండపంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆయన పట్టణవాసుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎప్పటినుంచో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. సదస్సులో పరిష్కారం కాని సమస్యలను అనంతరం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి. సుదర్శనరావు, సబ్ రిజిస్ట్రార్ కె. రాజు, డీటీలు రవిశంకర్, జగన్నాథం, ఆర్ఐ వేణుగోపాల్, వీఆర్వోలు గోవింద్, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: సదస్సులో పాల్గొన్న అధికారులు



విజయనగరం: ఫిర్యాదు పరిశీలిస్తున్న అధికారులు

ధర్మపురిలో..

విజయనగరం: నగరంలోని ధర్మపురిలో జరిగిన రెవెన్యూ సదస్సులో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య, తహసీల్దార్ కూర్మనాథ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సదస్సులో ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని తహసీల్దార్ చదివి వినిపించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ భూముల రికార్డులను ఒకసారి పరిశీలించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.

సర్వేకు సహకరించాలి..



విజయనగరం కార్పొరేషన్ పరిధిలో వివిధ వ్యాపార, పారిశ్రామిక, రిటైల్ రంగాలకు సంబంధించిన సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని కార్యదర్శులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిన్న, మధ్యతరహా పరిశ్రమదారుల వివరాలను సేకరించే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ సర్వే చేపడుతోందన్నారు. నగరంలో చిన్న చిన్న వ్యాపారాల నుంచి పరిశ్రమల వరకు.. సేవారంగంలో గల సెంటర్లు, జిరాక్స్, హోటల్స్ మొదలగు ఎంటర్‌ప్రైజస్ వరకు అందరి వివరాలు సర్వేలో పొందుపరచాలని సూచించారు. సమావేశంలో టీపీఆర్ఓ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం

వర్క్‌షాప్..



నెల్లిమర్ల సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్నోవేటివ్ ఎక్స్‌పరిమెంట్స్ ఇన్ ఫిజిక్స్‌లో భాగంగా బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్రం అధ్యాపకురాలు అన్వేషిక సమన్వయకర్తగా, జోగా చంద్రశేఖరరావు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. విద్యార్థులకు భౌతికశాస్త్రంలోని పలు క్లిష్టమైన అంశాలను ప్రయోగ పూర్వకంగా చేసి చూపించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ, భౌతిక శాస్త్ర అధ్యాపకులు కోట రవి శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

– నెల్లిమర్ల

సొంత భవనం నిర్మించేవరకూ పోరాటం..



సంతకాల సేకరణలో పాల్గొన్న పౌరవేదిక ప్రతినిధులు

● పట్టణ పౌర సంక్షేమ సంఘ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: జిల్లా కేంద్రంలో డిగ్రీ కాలేజీకి సొంత భవనం నిర్మించేవరకు పోరాటం చేస్తామమని విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘ కార్యదర్శి రెడ్డి శంకరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక సంగీత కళాశాల వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని లెక్చరర్స్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జయపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఒకప్పుడు విద్యలనగరంగా పేరొందిన విజయనగరంలో నేడు బీఈడీ, పీజీ, లా కళాశాలలు మూసివేయడం అన్యాయమన్నారు. డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాల్సిన బాధ్యత అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, రవికుమార్, ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ, రామచంద్ర, సుధీర్, భగవాన్, జగదీష్, చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి

● మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: అన్నదాతల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 13న విజయనగరం కంటోన్మెంట్ కలెక్టరేట్ వరకు నిర్వహించనున్న ర్యాలీకి నెల్లిమర్ల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, పార్టీ అభిమానులు భారీగా తరలిరావాలని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో జరగబోయే ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాల నుంచి అధికంగా రైతులు, అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు.

కల్యాణోత్సవం..



నగరంలోని పూల్‌బాగ్ లక్ష్మీగణపతి కాలనీలో వేంచేసిన వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం బుధవారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి నేతృత్వంలో స్వామివారికి వందలాది మంది భక్తుల సమక్షంలో కల్యాణం చేపట్టారు. వేదపండితుల వేద మంత్రోచ్చారణలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బేతా కృష్ణారావు, కార్యదర్శి శ్రీనివాస గోపాలకృష్ణ, శ్రీనివాసరావు, కూర్మారావు, పైడిరాజు, ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ, హర్ష, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం టౌన్

క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతే అనుమతులు

● కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాన్ని తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

విజయనగరం: క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టిన తర్వాతే భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య కార్పొరేషన్ సిబ్బంది, ప్రణాళికా అధికారులకు సూచించారు. ఈ మేరకు భవన నిర్మాణ అనుమతులకై వచ్చిన దరఖాస్తులను పరిశీలించే నిమిత్తం ప్రణాళిక అధికారులు బుధవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. అయ్యన్నపేట, అయ్యప్పనగర్, పూల్‌బాగ్ ప్రాంతాలలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, తదితరులు పర్యటించి వివరాలు నమోదు చేసుకున్నారు. తోటపాలెం ప్రాంతంలో నిబంధనలు అతిక్రమించి చేపడుతున్న పైఅంతస్తుల నిర్మాణాన్ని ప్రణాళిక సిబ్బంది అడ్డుకున్నారు. గంటస్తంభం ప్రాంతంలో నిబంధనలు అతిక్రమించి చేపడుతున్న నిర్మాణాన్ని కూడా తొలగించారు. అలాగే నగరంలో అనేక చోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను సిబ్బంది తొలగించి వేశారు.